కేకే ఆరోపణలు మానుకో..

- చేతనైతే మాకంటే ఎక్కువ అభివృద్ధి చేయండి
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాట్ల మధు

కాలువ వద్ద ఫొటోలతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 18: కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి ఆరోపణలు చేయడం మానుకోవాలి.. చేతనైతే మాకంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపించండి.. అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాట్ల మధు సవాల్ విసిరారు. గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో కాలువల ద్వారా నీటిని విడుదల చేయగా, అందుకు సంబంధించిన ఫొటోలను ఆదివారం తంగళ్లపల్లి మండలం జిల్లెల శివారులోని కాలువల వద్ద ప్రదర్శించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేకే మహేందర్‌రెడ్డి చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతుల ప్రయోజనం కోసం అహర్నిశలూ శ్రమించి నీళ్లు తెచ్చిన వ్యక్తి కేటీఆర్ అని కొనియాడారు. సిరిసిల్ల, సిద్దిపేట కలెక్టర్లకు అదేశాలు ఇచ్చి, కాలువలు పూర్తి చేయించిన ఘనత రామన్నదేనన్నారు. సిరిసిల్లకు కేటీఆర్ ఏం చేయలేదని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రైతులపై ప్రేమ ఉంటే నీళ్లు తెచ్చేలా పనులు చేయాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మండుటెండల్లో సైతం నీళ్లు తెచ్చి చెరువులను నింపామన్నారు. మరోసారి కేటీఆర్‌పై విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్, నాయకులు కొమ్మిటి రాజిరెడ్డి, సతీశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అబ్బాడి అనిల్‌రెడ్డి, సిలువేరి చిరంజీవి, భాస్కర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, సత్తిరెడ్డి, నర్ర నరేందర్‌రెడ్డి, అఫ్రోజు, రవి, బండి మల్లయ్య, రాజిరెడ్డి, లక్ష్మీనారాయణ, దేవరాజ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పల్లె వైద్యులకు జీతాల్లేవ్

- రెండు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బంది పడుతున్న వైద్యసిబ్బంది

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి కేసీఆర్ ప్రభుత్వం ఐదు వేల జనాభాకో పల్లె దవాఖానను ఏర్పాటు చేసింది. వైద్యులు, సిబ్బందికి ఇబ్బందిలేకుండా మెరుగైన వసతులు కల్పిస్తూ నూతన భవనాలు నిర్మించింది. నేషనల్ హెల్త్‌మిషన్‌లో భాగంగా 60మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను పల్లె దవాఖానలో పని చేసేందుకు నియమించింది. దీంతో వారు రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు నెలల నుంచి జీతభత్యం రాక పోవడంతో ఆవేదన చెందుతున్నారు. కుటుంబం గడవక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు అందించేలా చూడాలని వారు కోరారు.

– కోనరావుపేట, ఫిబ్రవరి 18

యువకుడి బలవన్మరణం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 18: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో గుండం రాజు(32) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా అంబారిపేటకు చెందిన రాజు మూడేండ్ల క్రితం పెండ్లి చేసుకొని ఇందిరమ్మకాలనీలో ఉంటున్నాడు. రెండేండ్ల క్రితం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో ఏడు నెలల క్రితం తిరిగివచ్చాడు. ఏదైనా పనిచేద్దామంటే ఆరోగ్యంతో సహకరించకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం, సిరిసిల్ల గారి సన్నిదిలో
యస్ .ఓ.పి. నెం. 5/2023
1.ద్యావనపల్లి రాజేశం
2.ఎక్కల్‌దేవి లక్ష్మి
3. జక్కని ఉమ – పిటిషనర్స్
మరియు
1. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ పి.ఎస్. కమీషనర్ (పెన్సియన్) రిజనల్ కార్యాలయం, కరీంనగర్.
2. ఎవరికి సంబంధించితే వారికి – రెస్పాండెంట్
పైన తెలిపిన పిటిషనర్స్ 1. ద్యావనపల్లి రాజేశం 2. ఎక్కల్‌దేవి లక్ష్మి 3. జక్కని ఉమ. అనువారు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం కోసం సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం నందు యస్.ఓ.పి.నెం. 5/2023 వేసియున్నారు. ద్యావనపల్లి కళావతి గారు జీవితకాలంలో రాజ్‌బిహార్ ఎంటర్ ప్రైజెస్ లి. తంగళపల్లి నందు బీడీ కార్మికురాలుగా పని చేసింది. P.P.O.No.TS/ RO/KRN/ PENSION/PPO/ 12752/ 2019/ 6019. P.F కార్యాలయం కరీంనగర్ నందు పెన్సియన్ డబ్బు రూ. 66,600/- (అరువది ఆరువేల ఆరువందలు) కలవు. వీటిని పిటిషనర్స్ స్వీకరించుటకు కోర్టు నందు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం కోసం కేసు వేసినారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నచో తేది: 23-02-2024న ఉదయం 10.30 వరకు కోర్టుకు హాజరు కాగలరు. లేనిచో పైన తెలిపిన పిటిషనర్స్‌కు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం జారీ చేయబడునని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా తెలుపనైనది.
//న్యాయస్థానం ఉత్తర్వు క్రమము//
తేది:17-02-2024 స్థలం:సిరిసిల్ల
ఇట్లు: Sd/- కుడిక్యాల రాజేశం
అడ్వకేట్,నోటరీ, సిరిసిల్ల. సెల్: 9393373158

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

PLOT FOR SALE

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

సొంతూరిపై మమకారం.. పేదలకు అభయం

హరిజనవాడలో ప్రారంభమైన వాటర్ ప్లాంట్ వద్ద గ్రామస్తులు (ఫైల్)

- మూడపల్లి సేవలో జువ్వాడి సాగర్‌రావు
- గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- లక్షలాది నిధులతో పనులు
- సర్వత్రా హర్షం

జ్యోతిష్మతి విద్యాసంస్థల అధినేతగా జువ్వాడి సాగర్‌రావు ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణలోనే సుపరిచితులు. చందుర్తి మండలం మూడపల్లికి చెందిన ఆయనకు బాల్యం నుంచే పుట్టిన ఊరంటే ప్రత్యేక అభిమానం. తల్లిదండ్రులు జువ్వాడి నారాయణరావు–మంగమ్మ నాలుగో సంతానమే సాగర్‌రావు. స్వగ్రామంలోని ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన, కరీంనగర్, హైదరాబాద్‌లో ఉన్నత విద్యనభ్యసించారు. కొలువులు ఎన్ని వరించినా కాదని, జ్యోతిష్మతి విద్యాసంస్థలను నెలకొల్పి, విశేష ప్రాచుర్యం పొందారు.

సొంతూరిపై అభివృద్ధి ముద్ర

ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరును మాత్రం మరిచిపోలేదు. ఈ క్రమంలో గ్రామంలో తాను చదువుకున్న పాఠశాలలో క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థుల కోసం ₹3లక్షలతో 100డెస్క్ టేబుళ్లను అందజేశారు. ఇదిలా ఉండగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా నగదు సాయం చేస్తున్నారు. గ్రామంలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ఉంది. ఈ క్రమంలో సాగర్‌రావు పదేళ్ల క్రితం తల్లిదండ్రులు నారాయణరావు–మంగమ్మల జ్ఞాపకార్థం ₹4లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడమే కాదు నిర్వహణ ఖర్చులు కూడా భరిస్తున్నారు. గ్రామ జనాభా 2500 ఉండగా, సదరు ప్లాంట్ సరిపోకపోవడంతో ఇటీవలే హరిజనవాడలో ₹4లక్షల వ్యయంతో సోదరుడు ఆనందరావు జ్ఞాపకార్థం మరో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

> ఆయన పథం. జన చేతనం. సొంతూరి సేవ అతని అభిమతం. గ్రామాన్ని అభివృద్ధి చేయడం, పేదలకు భరోసా ఇవ్వడం అంటే మహా ఇష్టం. ఆయనే మూడపల్లికి చెందిన జువ్వాడి సాగర్‌రావు. వ్యాపార రీత్యా కరీంనగర్‌లో స్థిరపడ్డ ఆయన, స్వగ్రామాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నారు. వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేస్తున్నాడు.
>
> – చందుర్తి, ఫిబ్రవరి 18

సొంతూరికి ఎంతచేసినా తక్కువే..

పుట్టిన ఊరికి ఎంత సేవ చేసినా తక్కువే. గ్రామంలో మౌలిక వసతులు, భావి పౌరులకు మంచి విద్య అందాలి. ఈ క్రమంలో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషిచేస్తున్నా. సహాయ సహకారాలు అందిస్తున్న.

– జువ్వాడి సాగర్‌రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్

20న రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 15: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ స్లాబ్‌పై ఉదయం 8గంటలకు నిర్వహించే హుండీ లెక్కింపులో ఉద్యోగులు, విధిగా హాజరుకావాలని వెల్లడించారు.

విశ్వబ్రాహ్మణ కమిటీ ఎన్నిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా దేశరాజు తిరుపతి, ఉపాధ్యక్షులుగా తిప్పారపు శ్రీనివాస్, కొడుముంజ రవి, ప్రధాన కార్యదర్శిగా కొడుముంజ తిరుపతి, కోశాధికారిగా తిప్పారపు సురేశ్, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి విఠల్, సలహాదారులుగా హన్మాండ్లు, వెంకటాచారి ఎన్నికయ్యారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

ముస్తాబాద్, ఫిబ్రవరి 18: రెండేండ్లకోసారి జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర కోసం మండల కేంద్రంలో ఏర్పాటు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని పులిశేరుకుంట సమీపంలో వెలిసిన గద్దెలను నిర్వాహకులు ముస్తాబుచేశారు. మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించే వేడుకల కోసం భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వేములవాడ వైద్య బృందానికి ఎన్‌క్వాస్ షీల్డ్ అందజేత

వేములవాడ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ మహేశ్‌రావు, వైద్య బృందానికి ఎన్‌క్వాస్ షీల్డ్ అందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఫిబ్రవరి18: రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలు అందించడంతో వేములవాడ ఏరియా దవాఖానకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ అందించింది. ఈ క్రమంలో కలెక్టర్ అనురాగ్‌జయంతి ఆదివారం సమీకృత కలెక్టరేట్‌లో వేములవాడ ఏరియా దవాఖాన వైద్యులు, సిబ్బందికి ఎన్‌క్వాస్ షీల్డ్ అందజేశారు. అవార్డు మీ బాధ్యతను మరింత పెంచిందని, ఇదే స్ఫూర్తితో రోగులకు నాణ్యమైన, అత్యుత్తమ వైద్య సేవలందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత, ఏరియా దవాఖాన కార్యాలయ పర్యవేక్షకుడు నాగరాజు, డిస్టిక్ క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్, తదితరులు ఉన్నారు.

గుమ్మి పుల్లయ్య స్మారక స్తూపాన్ని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డితో కలిసి ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గుమ్మి పుల్లయ్య పోరాటం మరువలేనిది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి18: తెలంగాణ సాయుధ పోరాటంలో గుమ్మి పుల్లయ్య చేసిన పోరాటం మరువలేనిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో గుమ్మి పుల్లయ్య స్మారక స్తూపాన్ని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డితో కలిసి విప్ ఆవిష్కరించారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గుమ్మి పుల్లయ్య పేదల హక్కుల కోసం,అణగారిన వర్గాల కోసం పోరాటం చేస్తే, వారి కుమారులు సామాజిక దృక్పథంతో, కరోనా సమయంలో పేదలకు సేవ చేశారని కొనియాడారు. గుమ్మి పుల్లయ్య అభ్యున్నతికి కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుంటి వేణు, కడారి రాములు, నాయకులు బొజ్జ కనకయ్య, చంద్రగిరి శ్రీనివాస్, పాత సత్యలక్ష్మి, పుల్లయ్య కుమారులు మధుమహేశ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్వోగా వంగరి శ్రీధర్

డీపీఆర్వో శ్రీధర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 18: జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారిగా వంగరి శ్రీధర్‌ను నియమిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా డీపీఆర్వోగా విధులు నిర్వర్తిస్తుండగా, ఇక్కడికి బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోచమ్మకు ఘనంగా చలి బోనాలు

రుద్రంగిలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు, చిన్నారులు

రుద్రంగి మండల కేంద్రంలో ఆదివారం మహిళలు పోచమ్మకు ఘనంగా చలిబోనాలు సమర్పించారు. ఇంటికో బోనంతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఎలాంటి ఆపదలు వాటిల్లకుండా చూడాలంటూ మాఘ అమావాస్య తర్వాత వచ్చే బుధ, ఆదివారాల్లో అమ్మవారికి చలిబోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమని మహిళలు తెలిపారు. చలి బోనాలు సమర్పించి తర్వాతే ఏ శుభకార్యమైన జరుపుకొంటామని వారు చెప్పారు.

– రుద్రంగి, ఫిబ్రవరి 18

చెడ్డీగ్యాంగ్ హల్‌చల్

- తాళం వేసిఉన్న ఇండ్లే టార్గెట్
- వరుస చోరీలతో భయాందోళనలో ప్రజలు

గ్రామాల్లో చివరిగా ఉన్న ఇండ్లనే టార్గెట్ చేస్తూ చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేస్తున్నది. పొద్దంతా తాళంవేసిన ఇండ్లను గుర్తించి, అర్ధరాత్రి సమయాన చోరీకి పాల్పడుతున్నది. రోజుకో ఊరిలో చొరబడి విలువైన బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదును ఎత్తుకెళ్తున్నది. దీంతో ప్రజలు భయం భ్రాంతులకు గురవుతుండగా, ఈ గ్యాంగ్‌ను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

–కోనరావుపేట, ఫిబ్రవరి 18

మంగళ్లపల్లిలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రాచారి (ఫైల్)

కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో జరిగిన చోరీలన్నీ గ్రామం చివరలో తాళం వేసిన ఇండ్లలోనే జరిగినవే. పొద్దంతా బైక్‌పై గ్రామాలను కలియతిరుగుతూ ఊరి చివరలో తాళం వేసి ఉన్న ఇండ్లను దుండగులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. దీంతో అర్ధరాత్రి సమయాన గ్రామాల్లోకి వెళ్లి చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో నిఘా నేత్రాలు లేకపోవడం, పలుచోట్ల ఉన్నా పని చేయకపోడంతో పోలీసులు దొంగలను గుర్తించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో దొంగలను పట్టుకునేందుకు పోలీసులు గ్రామాల్లో ప్రత్యేక రక్షక దళాలను ఏర్పాటు చేస్తున్నారు. యువకులను చైతన్యపరుస్తూ రాత్రివేళల్లో గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక బృందాలతో గాలింపు

కోనరావుపేట మండలం మంగళ్లపల్లి, మర్తనపేట, నిమ్మపల్లి, శివంగాళపల్లి గ్రామాల్లో ఇప్పటివరకు వరుస చోరీలు జరుగగా, విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. డీఎస్పీ నాగేంద్రాచారి ఘటనా స్థలాలను పరిశీలించి, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేయించారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చోరీ జరిగిన గ్రామాలతోపాటు సమీప ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. మర్తనపేటలో అర్ధరాత్రి సమయాన ఇద్దరు దుండగులు మాస్క్‌లు ధరించి, చేతులకు గ్లౌజులు వేసుకుని చెడ్డీ గ్యాంగ్ తిరుగుతున్నట్లు గుర్తించారు. వారి చేతుల్లో కత్తులు, టార్చిలైట్లు ఉన్నట్లు గుర్తించారు. అదే ముఠా శివంగాళపల్లిలో కూడా చోరీకి పాల్పడినట్లు సీసీ పుటేజీల్లో రికార్డు అయ్యింది. సీసీ పుటేజీ ఆధారంగా గ్రామాల్లో చెడ్డీగ్యాంగే చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. తాళంవేసి బయటికి వెళ్తే చుట్టూ పక్కల వారికి చెప్పాలని వివరిస్తున్నారు. గ్రామ పంచాయతీ మైక్ ద్వారా, డప్పుచాటింపు ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

త్వరలోనే పట్టుకుంటాం..

> వరుస చోరీల నేపథ్యంలో గ్రామాల్లో నిఘా పెంచాం. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే సీసీ కెమెరాల్లో రికార్డయినా పుటేజీ ఆధారంగా చెడ్డీగ్యాంగ్‌ను గుర్తించాం. ప్రజలు భయందోళన చెందవద్దు. ఎవరైనా ఇంటికి తాళం వేసి బయటికి వెళ్తే.. చుట్టుపక్కల ఇంటి వారికి సమాచారం ఇవ్వండి. గ్రామాల్లో యువకులు కూడా గస్తీ నిర్వహించి, దొంగలను పట్టుకునేందుకు సహకారం అందించాలి.
>
> – దువ్వాల ఆంజనేయులు, ఎస్ఐ (కోనరావుపేట)

సీసీ పుటేజీలో రికార్డ్‌అయిన దుండగుడి చిత్రం

శుభకార్యాలు.. ఆన్‌లైన్‌లో దీవెనలు..

రాజన్న సన్నిధిలో శుభకార్యాన్ని వీడియోకాల్‌లో కొడుకుకూతురికి చూపిస్తున్న తండ్రి రాజమల్లయ్య

రాజన్న సన్నిధిలో పుట్టెంట్రుకల శుభకార్యాన్ని వీడియోకాల్ ద్వారా కుటుంబ సభ్యులకు చూపిస్తున్న రాజమల్లయ్య

సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో రెండు నెలలుగా రాజన్న ఆలయం భక్తులతో పోటెత్తుతున్నది. పుట్టెంట్రుకలు, కోడె మొక్కులు, బంగారం సమర్పించేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన రాజమల్లయ్య తన మనుమడు ధ్రువ పుట్టెంట్రుకల కార్యక్రమాన్ని అల్లుడు రాకేశ్‌కుమార్ కూతురు సుష్మిత, బంధువులతో కలిసి ఆదివారం రాజన్న సన్నిధిలో నిర్వహించారు. అయితే రాజమల్లయ్య కుమారుడు చంద్రవర్ధన్ అమెరికాలో, పెద్ద కూతురు రష్మిత ఉద్యోగరీత్యా రాజస్థాన్‌లో ఉంటున్నారు. దీంతో రాజమల్లయ్య వీడియోకాల్ ద్వారా కొడుకు కూతురికి శుభకార్యాన్ని చూపించాడు. అనంతరం వారు ధ్రువను దీవించారు. సాంకేతికత ఆధారంగా రాజన్న ఆలయంలో జరిగిన ఈ శుభకార్యాన్ని పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు.

– వేములవాడ, ఫిబ్రవరి 18

సంఘాలు-కార్యవర్గాలు

చందుర్తి, ఫిబ్రవరి 18: చందుర్తి మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా దూది శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పూడూరి ప్రశాంత్‌రెడ్డి, నల్ల ఆనందరెడ్డి, కోశాధికారిగా దారం బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏరెడ్డి రాజిరెడ్డి, సలహాదారులుగా దారం హనుమంతరెడ్డి, సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనంతరెడ్డి, లచ్చిరెడ్డి, తిరుపతిరెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే చందుర్తి మండల రెడ్డి యువజన విభాగం అధ్యక్షుడిగా పూడూరు జీవన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కూతురు మహేందర్‌రెడ్డి, సంతపూరి బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్లాల తిరుపతిరెడ్డి, సలహాదారుడిగా రాంరెడ్డి అమరేందర్‌రెడ్డి, కోశాధికారిగా దారం రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా బద్ధం తిరుమలరెడ్డిని ఎన్నుకున్నారు.

మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

భూసార పరీక్షపై అవగాహన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి18: జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాలలో మృత్తిక శాస్త్ర విభాగంలో భూసార, నీటి పరీక్ష యూనిట్‌ను జిల్లెల్ల రైతులు సందర్శించారు. భూసార, నీటి పరీక్షల ప్రాముఖ్యత, నీటిలో లవణ సాంద్రతపై రైతులకు వివరించారు. భూసార పరీక్షల కోసం రైతులు ఈ నంబర్లలో (99510 24256, 8459321228) సంప్రదించాలని సూచించారు. అలాగే కళాశాలలో వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను రైతులు సందర్శించారు. ఇక్కడ అసోసియేట్ డీన్ శ్రీదేవి, మేనేజింగ్ డైరెక్టర్లు ప్రొఫెసర్ కనకదుర్గ, వాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రియదర్శిని, డైరెక్టర్ సీహెచ్ రమేశ్, విద్యార్థులు ఉన్నారు.

అధునాతన సాగుపై ..

గంభీరావుపేట, ఫిబ్రవరి 18: గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివృద్ధి యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తపల్లిలో రైతులకు అధునాతన పద్ధతులపై జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అవగాహన కల్పించారు. ఇక్కడ ఏఈవోలు గౌతమి, సాయితేజ, అజయ్ ఉన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

గంభీరావుపేట, ఫిబ్రవరి 18: మండల కేంద్రానికి చెందిన కరాటే క్రీడాకారులు మర్గల బుచ్చిబాబు, ముద్రకోల ఆంజనేయులు జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాద్‌లో షొటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ పోటీలో పాల్గొని బుచ్చిబాబు 4వ డిగ్రీ, ఆంజనేయులు 1వ డిగ్రీ పొందారు. అసోసియేషన్ నిర్వాహకులు మహ్మద్ జహంగీర్ (ఆసియా జడ్జి) వారికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 18: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్ఐ దాస సుధాకర్ పేర్కొన్నారు. తిప్పాపూర్ గ్రామంలో ఆదివారం మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ నిర్వాహకులు, క్రీడాకారులు ఉన్నారు.

▲ అధ్యాపకుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు,

అ'పూర్వ' సమ్మేళనం

నాంపెల్లి శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేములవాడ మండలం రుద్రవరం జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులంతా (2003–04లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

– వేములవాడ రూరల్, ఫిబ్రవరి 18

శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 18: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో కేసీఆర్‌నగర్ కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. తమ కాలనీవాసుల కోసం శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని ఆదివారం వారు కేసీఆర్‌నగర్ కాలనీ ప్రధాన గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.